క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన అబ్దుల్ ఖాదర్



వైఎస్ జగన్‌ను సత్కరిస్తున్న అబ్దుల్ ఖాదర్

అమలాపురం టౌన్: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌ను ఆయన దుశ్శాలువాతో సత్కరించారు.

ఉద్యోగులకు ఎంపీడీఓ సత్కారం

అల్లవరం: మండలంలో బాల్య వివాహాలను నివారించడంలో అత్యుత్తమంగా విధులు నిర్వర్తించిన మహిళా సంరక్షణ కార్యదర్శి సువర్ణ, ఏఎస్ఎం గంగాభవాని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రోజాను ఎంపీడీఓ కృష్ణమోహన్ శాలువాలతో సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌస్‌హోల్డ్ సర్వే, బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతి గ్రామంలో నూరు శాతం నమోదు కావాలని సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనకు ప్రతి ఉద్యోగి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రాజమోహన్, సాయిబాబు, వీరబాబు, మృధుల, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి ఎఫ్-3 చేయూత



వృద్ధురాలిని ఓల్డేజ్ హోమ్‌లో చేర్చుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: తాను ఎక్కడ నుంచి వచ్చిందో, చిరునామా ఏమిటో చెప్పలేని స్థితిలో ఉన్న అనాథ వృద్ధురాలికి స్థానిక ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్(ఎఫ్-3) ఫౌండేషన్ సంస్థ గురువారం చేయూతనిచ్చింది. స్థానిక శంకర మఠం ప్రాంతంలో దాదాపు 80 ఏళ్ల వయసున్న పసివేదల సత్యవతి అనే వృద్ధురాలు తాను ఎక్కడ నుంచి వచ్చిందీ, తన వివరాలను చెప్పలేకపోతోంది. దీంతో స్థానికులు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పఠాన్ అబ్జానీ(జానీ)కి సమాచారం అందించారు. దీంతో ఫౌండేషన్ తరఫున అబ్జానీ, సంస్థ ప్రతినిధులు స్పందించి ఆమెను చేరదీసి, ఆశ్రయం కల్పించారు. స్థానిక కరక్కాయపేటలోని సెయింట్ జోసెఫ్స్ ఓల్డేజ్ హోమ్‌లో ఆమెను చేర్చారు. ఆమెకు ఏదైనా అవసరమైతే తామున్నామని ఫౌండేషన్ తరఫున హామీ ఇచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జానీతో పాటు, ప్రతినిధులు పి.రమణ, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

ఎస్‌జీపీఏ సలహాదారు చిక్కం మృతి



సూర్యనారాయణ(ఫైల్)

ఉప్పలగుప్తం: ఏపీ పెన్షనర్ల సంఘ అమలాపురం యూనిట్ గౌరవ సలహాదారు చిక్కం సూర్యనారాయణ(86) అనారోగ్య కారణాలతో బుధవారం రాత్రి మరణించారు. ఈయన ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఎస్టీయూ ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంపై ఉపాధ్యాయులు, ఎస్టీయూ నాయకులు సంతాపం తెలిపారు.

ఘనంగా యువ ఉత్సవ్

అల్లవరం: కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడా మంత్రిత్వ శాఖ, జిల్లా నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ అధ్యక్షత వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పించారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, డ్రాయింగ్, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. కళాశాల చైర్మన్ కృష్ణ సతీష్, వైస్ ప్రిన్సిపాల్ ఆకుల ప్రవీణ్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి పరిశీలన

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం పరిశీలించారు. ఆస్పత్రి పైఅంతస్తులో కొంత కాలంగా అభివృద్ధి పనుల పేరిట సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టక, అది వినియోగంలోకి రావడం లేదని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజినీర్, ఆ కాంట్రాక్టర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేసి, రోగులకు అందుబాటులోకి తేవాలని వారికి సూచించారు.

రీజెన్సీకి రాజకీయ గ్రహణం

- స్థానిక నేతల వైఖరితో పరిశ్రమ పునఃప్రారంభం ప్రశ్నార్థకం
- మరోచోటికి తరలించాలని ఒకరు.. ప్రారంభించాలని మరొకరు పట్టు
- ఉపాధి కోసం వందలాది కార్మికుల ఎదురుచూపులు



మూతబడిన రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ

యానాం: ఆ ప్రాంతమంతా వందలాది మంది కార్మికుల బూట్ల చప్పుళ్లు. భారీ వాహనాల రణగణ ధ్వనులు. షిఫ్ట్ షిఫ్ట్‌కు సైరన్ మోతతో తమ వాచీలను చూసుకుని పరుగెత్తే హడావుడి. మరోవైపు సెక్యూరిటీ గార్డుల తనిఖీలు. ఎగుమతుల కోసం పొడవునా వందలాది లారీలు.. ఇవీ ఒకప్పుడు సిరామిక్స్ రంగంలో తిరుగులేని విధంగా వెలుగొందిన రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీ ఒకప్పటి దృశ్యాలు. విధి విచిత్రం.. వేలాది మంది కార్మికులకు ఉపాధినిచ్చిన సంస్థ 2012 జనవరి 27న ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటన ఒక్క రోజులో కార్మికుల జీవిత గమనాన్నే మార్చేసింది. ఆ ఘటన జరిగి పుష్కర కాలం అవుతున్నప్పటికీ.. కార్మికులంతా ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

1983లో స్థాపన

రీజెన్సీ పరిశ్రమను ఇటలీలోని ప్రఖ్యాత వెల్‌కో అనే సంస్థతో కలిసి సంయుక్తంగా యానాంలోని మెట్టకూరులో భారీ పరిశ్రమను డాక్టర్ జీఎస్ నాయుడు నాయకత్వంలో స్థాపించారు. రోజుకు దాదాపు 4 వేల స్క్వేర్‌మీటర్ల టైల్స్ తయారీ నుంచి ఏకంగా రోజుకు నాణ్యతతో 44 వేల స్క్వేర్‌మీటర్లు తయారు చేసే స్థాయికి చేరింది. దేశవ్యాప్తంగా 700 మంది డీలర్లు, మధ్య ఆసియా, ఆఫ్రికా ఖండాలతో పాటు, 40 దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది.

నేరుగా వందలాది, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి

పరిశ్రమలో యానాం పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది కార్మికులు ఉపాధి పొందడంతో పాటు, మరికొన్ని అనుబంధ పరిశ్రమల నిర్మాణంతో వేలాదిగా ఉపాధి పొందేవారు. అంతేకాకుండా రీజెన్సీ ఫ్యాక్టరీకి అనుబంధంగా ఆ సంస్థ చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పడంతో, అక్కడా అధిక సంఖ్యలో కార్మికులు ఉపాధి పొందేవారు. అనంతరం జరిగిన దుర్ఘటనలో కార్మికుల నుంచి కార్మిక నేత మచ్చా మురళీమోహన్‌ను కోల్పోతే, అనంతరం యాజమాన్యం నుంచి రీజెన్సీ వైస్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌ను కోల్పోయారు.

పన్నుల చెల్లింపు ఎలా?.

దగ్ధమైన, 12 ఏళ్ల పాటు మూతపడిన ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి అడుగులు వేస్తుంటే, గతంలో ఉన్న విద్యుత్, మున్సిపాలిటీ, కార్మిక, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు పన్నుల బకాయిలు చెల్లించాలని మల్లాడి చెబుతున్నారు. అయితే ఫ్యాక్టరీ మూతపడిన కాలానికి పన్నులు ఎలా చెల్లిస్తారని రీజెన్సీ సంస్థ ప్రశ్నిస్తోంది. ఇలా చేయడం ఫ్యాక్టరీని ఆపడానికి చేసే ప్రయత్నమా అని నాయుడు ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ఫ్యాక్టరీని ఎలా తరలిస్తారని, ఇది మేలు కాకుండా, కీడు చేస్తున్నట్లు ఉందన్నారు. సీఎం రంగసామి హామీతోనే ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి సిద్ధపడ్డామన్నారు.

నేతల్లో కానరాని ఏకాభిప్రాయం

రీజెన్సీ పునఃప్రారంభానికి ఇప్పటికే యాజమాన్యం సుమారు రూ.25 కోట్లు మరమ్మతులు, సదుపాయాల కల్పనకు ఖర్చు పెట్టింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ రీజెన్సీ ఎండీ డాక్టర్ జీఎస్ నాయుడుతో చర్చించారు. పునఃప్రారంభానికి తాను శాసనసభ్యుడిగా ఇప్పటివరకు సహకరించానని, భవిష్యత్తులోనూ సహకరిస్తానని భరోసా ఇచ్చారు. పరిశ్రమను తెరిస్తే వందలాది మందికి ఉపాధి కలుగుతుందన్నారు. అయితే మరోవైపు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వాదన మరోలా ఉంది. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీని మాస్టర్‌ప్లాన్ ప్రకారం వేరేచోటకు తరలించాలని, రీజెన్సీకి దొమ్మేటిపేట, అడివిపాలెం ప్రాంతాల్లో ఉన్న భూముల్లోకి తరలించాలని అంటున్నారు. దీనిపై తాను పుదుచ్చేరి ప్రభుత్వానికి తెలియజేయనున్నట్లు ప్రకటించారు. మరోవైపు విద్యుత్, మున్సిపాలిటీ, కమర్షియల్ టాక్స్, కార్మిక శాఖలకు కోట్లాది రూపాయల మేర బకాయిలు ఉన్నాయని, వాటిని చెల్లించాలని మరో వాదన వినిపిస్తోంది.

అడ్డుకోవడం దురదృష్టకరం



12 ఏళ్ల నుంచి రీజెన్సీ ఫ్యాక్టరీ మూతపడటంతో స్థానికంగా యువత ఉపాధి కోల్పోయింది. పునఃప్రారంభించేలా ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి, వారిని ఒప్పించి, వారికి మనోధైర్యాన్ని కల్పించాం. ఢిల్లీ సైతం వెళ్లి సంబంధిత వారిని కలిశాం. మరమ్మతులకు కోట్లాది రూపాయలు పెట్టుబడి పెట్టి ప్రారంభమవుతుందనగా మళ్లీ కొంత మంది రాజకీయంగా అడ్డుకోవడం దురదృష్టకరం

– గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఎమ్మెల్యే, యానాం

ఇబ్బందులు ఉంటాయి



మాస్టర్‌ప్లాన్ ప్రకారం ప్రస్తుతం ఉన్న రహదారులు ఫ్యాక్టరీకి వచ్చే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడతాయి. ప్రస్తుతం ఫ్యాక్టరీ ప్రారంభమైతే పరిసర ప్రాంతాల్లో ఉన్న నివాసితులు ఉండలేరు. కాబట్టి దొమ్మేటిపేట పరిసర ప్రాంతాల్లో వందలాది ఎకరాలు రీజెన్సీకి భూమి ఉంది. మూడు నుంచి ఐదేళ్లలోపు అక్కడకు తరలించాలని రాతపూర్వకంగా పుదుచ్చేరి ప్రభుత్వాన్ని కోరుతాను. స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి.

– మల్లాడి కృష్ణారావు, ఢిల్లీ ప్రతినిధి, పుదుచ్చేరి ప్రభుత్వం

ఆ లెక్కలు అన్యాయం



పాతికేళ్లుగా నిరాటంకంగా నడిచిన రీజెన్సీ ఫ్యాక్టరీ కొన్ని కారణాల వల్ల మూతపడింది. దానిని ఇప్పుడు వేరే ప్రాంతానికి తరలించమనడం భావ్యం కాదు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎప్పుడూ వాయిదా వేయలేదు. మూతపడిన తర్వాత కూడా పరిశ్రమ నడుస్తున్నట్లు లెక్కలు చూపించడం అన్యాయం.

– డాక్టర్ జీఎస్ నాయుడు, ఎండీ, రీజెన్సీ ఫ్యాక్టరీ

'కౌశల్' పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

అమలాపురం టౌన్: ఆంధ్ర ప్రదేశ్ సైన్స్ సిటీ, రాష్ట్ర విజ్ఞాన భారతి సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల్లో స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ చూపి విజేతలయ్యారు. ఈ పోటీల రీల్స్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని కారెం రేష్మశ్రీ, క్విజ్ విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని దూడల హాసిని, పోస్టర్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని జక్కంపూడి తులసీ చందు ప్రథమ స్థానాలు సాధించి, రూ.1,500 చొప్పున నగదు బహుమతులు కైవసం చేసుకున్నట్టు హెచ్‌ఎం కె.ఘన సత్యనారాయణ తెలిపారు. విజేతలు ఈ నెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని చెప్పారు. వీరు రాష్ట్ర స్థాయిలోనూ విజేతలై అమలాపురానికి మరింత ఖ్యాతి తేవాలని డీఈవో షేక్ సలీమ్ బాషా, డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు పీవీఎల్ఎన్ శ్రీరామ్, బీఎన్ వెంకటేశ్వరరావు, పళ్లాలమ్మ, వర్మ, నాగేంద్రరాజు, సుబ్రహ్మణ్యం విజేతలను అభినందించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఉప్పలగుప్తం: మరమ్మతుల కోసం మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బాధిత కుటుంబాలకు పొన్నాడ పరామర్శ



పి.మల్లవరంలో వైస్ ఎంపీపీ నాగేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న పొన్నాడ తదితరులు

తాళ్లరేవు: పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న తాళ్లరేవు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ధూళిపూడి నాగేంద్రప్రసాద్‌ను పొన్నాడ పరామర్శించారు. పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నూకరాజు కుటుంబాన్ని ఓదార్చారు. అనారోగ్యంతో ఉన్న కోరంగి ఎంపీటీసీ పోతుల రత్నకుమారి, పాత కోరంగి స్కూల్ కమిటీ చైర్మన్ లోవరాజు, పెస్సింగి వర్మను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, నేల కిషోర్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, సర్పంచ్ పెయ్యల మంగేష్, పలువురు నాయకులు ఉన్నారు.

సమ్మెకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల మద్దతు



సమ్మె చేస్తున్న సిబ్బందికి మద్దతు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: తమ డిమాండ్ల సాధన కోసం అమలాపురం మున్సిపాలిటీ ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ డోర్, ఇండోర్లలో పని చేస్తున్న 54 మంది సిబ్బంది చేపట్టిన సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన తెలుపుతున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వైఎస్సార్ సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, బండారు గోవింద్ తదితర నాయకులు మద్దతు తెలిపారు. సమ్మె శిబిరాన్ని పార్టీ కౌన్సిలర్లు, నాయకులు గురువారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ పోస్టులను క్రమబద్ధీకరించాలని తదితర డిమాండ్లతో అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆందోళనకారులు కౌన్సిలర్లకు అందజేశారు.

పన్ను బకాయిదారులకు మున్సిపాలిటీ షాక్

17 కుళాయి కనెక్షన్ల తొలగింపు



మెట్లకాలనీలో ఓ బకాయిదారుని ఇంటి కుళాయి కనెక్షన్‌ను తొలగిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, వాటర్ కనెక్షన్ల చార్జీలు సకాలంతో చెల్లించకపోతే బకాయిదారుల ఇళ్లకు చెందిన వాటర్ కనెక్షన్‌ను తొలగిస్తున్నట్లు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ ఇచ్చిన నోటీసులకు స్పందించకుండా,, రెవెన్యూ సిబ్బంది పదే పదే తిరుగుతున్నా పన్నులు చెల్లించని 17 మంది బకాయిదారులకు మున్సిపాలిటీ గురువారం షాక్ ఇచ్చింది. వారి ఇళ్లకు చెందిన వాటర్ కనెక్షన్లను వాటర్ వర్క్స్ సిబ్బంది కట్ చేశారు. పట్టణంలోని మెట్ల కాలనీలో ఆస్తి పన్నుల డ్యూలు పెరిగిపోయిన 17 మంది బకాయిదారులకు చెందిన ఇళ్లకున్న మున్సిపల్ కుళాయి కనెక్షన్లు తొలగించినట్లు కమిషనర్ రాజు తెలిపారు. పట్టణంలో పన్నుల చెల్లింపుల్లో జాప్యం జరిగినా, నోటీసులకు స్పందించకున్నా అలాంటి బకాయిదారుల నుంచి పన్నులపై వడ్డీ, జరిమానా విధించి వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుటే ఆక్రమణ



మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ

అమలాపురం టౌన్: మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకుని ఓ ప్రైవేటు వ్యాపార సంస్థ చేపట్టిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ నిర్మాణంపై అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు వల్ల ఒరిగిందేమీ లేదని ఫిర్యాదుదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ అంశంపై గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు కలిసి అధికారులను నిలదీసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆ ప్రైవేట్ వ్యాపార సంస్థకు సబ్ లీజుకు ఇచ్చిన మున్సిపల్ కార్యాలయం ఎదుట ఈ–సేవ భవనానికి సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ నిర్మాణానికి ఓ కాంట్రాక్టర్ సిఫార్సుతో మున్సిపాలిటీయే ట్రాన్స్‌కోకు రూ.9 లక్షలు కట్టిన వైనంపై కౌన్సిల్ సమావేశంలో దుమారం రేగింది. కౌన్సిలర్ల అభ్యంతరాలతో ఎట్టకేలకు కమిషనర్ రూ.9 లక్షల చెల్లింపును సాంకేతికంగా నిలిపివేశారు. మున్సిపల్ స్థలాన్ని ఆక్రమిం,చుకున్న వ్యక్తి మున్సిపల్ కార్యాలయం ఎదుటే ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ నిర్మించడంపై కలెక్టరేట్ స్పందనలోనే కాకుండా, కమిషనర్‌కు ఫిర్యాదులు అందాయి. ఆయా ఫిర్యాదులను పట్టించుకోకుండా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ నిర్మించడంపై ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.9 లక్షలు చెల్లించడాన్ని అధికారులు విరమించుకున్నా, ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ నిర్మాణాన్ని అడ్డుకునే సాహసం చేయలేకపోయారు. ఇందుకు రాజకీయ ప్రమేయమే కారణమని పలువురు విమర్శిస్తున్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

- పట్టణంలో నేడు పార్టీ శ్రేణుల భారీ ర్యాలీ
- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ



రైతులకు అండగా నిర్వహించే ర్యాలీపై చర్చిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

అమలాపురం టౌన్: రైతులకు హామీలెన్నో ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారి కష్టనష్టాలను పట్టించుకోని పరిస్థితులపై రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ స్పందించి అన్నదాతలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. అమలాపురంలో శుక్రవారం ఉదయం వైఎస్సార్ సీపీ రైతులకు అండగా పుర వీధుల్లో ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత కార్యక్రమాలు చేపడుతోంది. ఆయా కార్యక్రమాలపై చర్చించేందుకు స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో గురువారం జరిగిన పట్టణ పార్టీ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం.. శుక్రవారం ఉదయం రైతులకు మద్దతుగా నిర్వహించే కార్యక్రమాల వివరాలను వెల్లడించింది. ఉదయం 10 గంటలకు పట్టణ పార్టీ శ్రేణులు అమలాపురం షరీఫ్ కాంప్లెక్స్ వద్ద మెయిన్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ ర్యాలీ షరీఫ్ కాంప్లెక్స్ నుంచి మొదలై నల్ల వంతెన, ముక్తేశ్వరం రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకూ రోడ్డు మార్గాన దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగుతుందని సమావేశం వెల్లడించింది. కలెక్టరేట్‌కు ర్యాలీ చేరుకున్నాక అక్కడ కొంతసేపు ఆందోళన చేయనున్నట్టు పేర్కొంది. ర్యాలీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, అమలాపురం కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ పాల్గొంటారని సమావేశం పేర్కొంది. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు రైతులు పడుతున్న కష్టనష్టాల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రం ఇవ్వనున్నట్టు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్యాసిదాసు (line break: సన్న / య్యదాసు), చిత్రపు రామకృష్ణ, కొల్లాటి దుర్గాబాయి, బండారు గోవింద్, పార్టీ నాయకులు కుడుపూడి భరత్‌భూషణ్, కముజు రమణ, దొంగ చిన్నా, చిక్కాల రవిశంకర్, రాజి గోపీరమేష్, కల్వకొలను ఉమ, ఖ్వాజాబాబు, సాగిరాజు తసాయిరాజు ప్రసంగించారు. శుక్రవారం ఉదయం ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక షరీఫ్ కాంప్లెక్స్‌కు శుక్రవారం ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులు చేరుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

రైతులకు మద్దతుగా తరలిరావాలి

ఐ.పోలవరం: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, రైతులకు ప్రభుత్వం అందించాల్సిన ఆర్థిక సాయం వంటి విషయాలపై శుక్రవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ అధ్యక్షతన అమలాపురం ఎర్రవంతెన వద్ద నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందిస్తారన్నారు. మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అత్యధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే పొన్నాడ



ముమ్మిడివరం: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అమలాపురం నల్లవంతెన నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతు సమస్యలపై నిర్వహించే ర్యాలీకి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని, పెట్టుబడి సాయం ఇవ్వకపోవడం, బీమా ఎత్తివేయడం, గత ప్రభుత్వంలో లాగా సచివాలయాల ద్వారా ఇస్తున్న ఎరువులకు ముందుగా సొమ్ము చెల్లించాలని అడగడం వంటి రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తారన్నారు. ఉదయం 9 గంటలకు నల్లవంతెన నుంచి ర్యాలీగా బయలు దేరి వెళతామని, రైతులు, పార్టీ శ్రేణులు విధిగా పాల్గొనాలని కోరారు.

సంక్షిప్తంగా..

ఓఎన్‌జీసీ పరిహారం కోసం పోరాటం

యానాం: రిలయన్స్, ఓఎన్‌జీసీ సంస్థలు మత్స్యకారులకు నష్టపరిహారం ఇస్తున్నట్లుగానే యానాంలో అన్ని వర్గాల పేదలకు పరిహారం చెల్లించాలని కోరుతూ పుదుచ్చేరి సీఎం రంగసామికి వినతి పత్రం పంపినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ మేరకు పోరాటానికి సిద్ధమవుతున్నట్లు గురువారం వారు విలేకరులకు తెలిపారు. చమురు సంస్థలకు చేర్చి ఉన్న ఆయా వర్గాల ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతున్నప్పటికీ, వారికి పరిహారం ఇవ్వాలని అధికార పక్ష నేతలు చర్యలు తీసుకోనందువల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల్లో చమురు సంస్థలు పైపులైన్లు వేసి, కార్యకలాపాలు చేపట్టినప్పటికీ నేటివరకు వారికి పరిహారం చెల్లించలేదన్నారు.

వాహనం అందజేత

యానాం: పీఎంఎస్‌వై ద్వారా మంజూరైన వాహనాన్ని గురువారం సావిత్రినగర్‌కు చెందిన లబ్ధిదారుడు కర్రి స్వామికి ఆర్ఏట మునిస్వామి అందజేశారు. ఇన్సులేటెడ్ 20 టన్నుల సామర్థ్యమున్న వాహనానికి రూ.8 లక్షలు సబ్సిడీ మంజూరైనట్టు మత్స్యశాఖ అధికారి గొంతియ్య తెలిపారు.

నేషనల్ సీనియర్ ఆర్బిటర్ పరీక్షలో తేజేష్ ప్రతిభ

యానాం: ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన చదరంగ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించే వారికి నిర్వహించిన నేషనల్ సీనియర్ ఆర్బిటర్ పరీక్షల్లో యానాంకు చెందిన ఓలేటి తేజేష్ రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానం సాధించారు. ఈ మేరకు రాజమండ్రిలో రెండు రోజుల పాటు నిర్వహించిన దేశవ్యాప్త ఆర్బిటర్ పరీక్షకు వివిధ రాష్ట్రాల నుంచి 73 మంది హాజరు కాగా, 21 మంది ఉత్తీర్ణత సాధించారు. తాను నాలుగో స్థానం సాధించినట్లు తేజేష్ ఓ ప్రకటనలో తెలిపారు. యానాం నుంచి ఈ ఘనత సాధించిన ప్రథమ వ్యక్తి తానేనని తెలిపారు.

డ్రోన్ పైలట్ శిక్షణ శిబిరం



డ్రోన్ శిక్షణకు హాజరైన ఏవియేషన్ ప్రతినిధులు

కాట్రేనికోన: అమలాపురం సమీపంలోని చెయ్యేరు శ్రీనివాస అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో అకిన్ అనలిటిక్స్ సంస్థ డ్రోన్ పైలట్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. డ్రోన్ భద్రత, అర్హత ప్రమాణాల తనిఖీకి ఢిల్లీకి చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ పర్యవేక్షక బృందం విచ్చేసింది. డ్రోన్ శిక్షణలో మౌలిక సదుపాయాలు, సాంకేతిక నిర్వహణ కళాశాల యాజమాన్యం సక్రమంగా ఏర్పాటు చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ, డ్రోన్ ఆవశ్యకత అన్ని రంగాల్లో పెరిగిందన్నారు. ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం, విపత్తుల నిర్వహణ, సైన్యం, వన్యప్రాణుల పర్యవేక్షణ, కమ్యూనికేషన్ రంగాల్లో డ్రోన్ వినియోగం ఎక్కువగా ఉందన్నారు.

ఆక్రమణలపై ఆర్డీవోకు వినతి

ఉప్పలగుప్తం: భీమనపల్లి రెవెన్యూ కిత్తనచెరువు పంచాయతీ సీతారామపురంలో పేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించిన సర్వే నం.607లో 2.57 ఎకరాల భూమిని ఆనుకుని ఉన్న పొలాలను లబ్ధిదారులు ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు ఆర్డీవో కె.మాధవీలతకు గురువారం వినతిపత్రం అందించారు. ఆక్రమణలను గుర్తించాలని గ్రామస్తులు కోరారు. భీమనపల్లి గ్రామంలో తహసీల్దార్ వీఎస్ దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో అర్జీలను పరిశీలించారు. సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు దేశంశెట్టి నాగ రత్నకుమారి, నాగులపల్లి శేషవేణి, ఆకేటి బాబులు, చిల్లా పురుషోత్తం, బండారు వెంకటేశ్వరరావు, డీటీ సుబ్రహ్మణ్యం, వీఆర్‌వోలు రాము, శ్రీరామ్, ఈవో కార్తీక తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: సాకుర్రు గ్రామంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కిషోర్‌బాబు ఆధ్వర్యంలో రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

ఐ.పోలవరం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 14న జరగాల్సి ఉండగా, ఈ నెల 15కు వాయిదా వేసినట్టు ఎంపీడీవో డీఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నందున సమావేశం వాయిదా వేసినట్టు చెప్పారు.